క్లుప్తంగా

యువత రాజకీయాల్లో రాణించాలి



మరిపెడ రూరల్: నేటి యువత రాజకీయాల్లో రాణించాలని జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీఎస్ రవిచంద్ర అన్నారు. డోర్నకల్ నియోజకవర్గంలోని సీరోలు, నర్సింహులపేట మండలాలను చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు మండలంలోని ఎల్లంపేటలో రవిచంద్ర సమక్షంలో ఆదివారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి రవిచంద్ర గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాడు. చేరిన వారిలో సీరోలు మండలం అందనాలపాడు మాజీ సర్పంచ్ ఆంగోతు రాంచంద్రు, అమర్‌సింగ్, రాందాస్, శ్రీను తదితరులు ఉన్నారు.

యంగెస్ట్ సీఈఓ అవార్డు ప్రదానం



డోర్నకల్: డోర్నకల్ మండలం ఉయ్యాలవాడకు చెందిన వ్యాపారవేత్త సాంపంగి సురేష్ యంగెస్ట్ సీఈఓ అవార్డు అందుకున్నాడు. ఐటీ రంగంతోపాటు ఇతర వ్యాపార రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఐటీ టీవీ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్ హైటెక్ సిటీ టీహబ్‌లో జరిగిన కార్యక్రమంలో సినీ హీరో సుమన్ చేతుల మీదుగా సంపంగి గ్రూప్ సీఈఓ 28 ఏళ్ల సంపంగి సురేష్ యంగెస్ట్ సీఈఓ అవార్డు అందుకున్నాడు. ఈ కార్యక్రమానికి ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురేష్‌తో సోదరుడు రమేష్‌తో సంపంగి గ్రూప్ రియల్ ఎస్టేట్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, హాస్పటాలిటీ, బయోఫార్మింగ్ కంపెనీలను నిర్వహిస్తున్నారు. సంపంగి గ్రూప్స్ కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో ఆరు శాఖలు నిర్వహిస్తుండగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు సింగపూర్, మలేషియా, యూఏఈ దేశాల్లోనూ శాఖలను ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: నవంబర్ 15వ తేదీన జరగనున్న కల్లుగీత కార్మిక సంఘం 66వ వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌని వెంకన్న ఆదివారం పిలుపునిచ్చారు. గీత కార్మికులు, సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సభకు కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ హాజరుకానున్నారని తెలిపారు.

పోలీసుల కవాతు



కురవి: మండల కేంద్రంలో ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను రక్షించేందుకుగాను ఆదివారం రాత్రి బీఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ నుంచి గుడి సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్, కురవి ఎస్సై గోపి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది అగ్రకుల అహంకారం



డోర్నకల్: అగ్రకుల అహంకారంతోనే రేవంత్‌రెడ్డి లంబాడాలపై అణుచిత వ్యాఖ్యలు చేశారని బీఆర్ఎస్ మండల గిరిజన నాయకులు తేజావత్ రాజునాయక్ అన్నారు. మండలంలోని బొడ్రాయితండాలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెబుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ ముసుగులో అగ్రవర్ణ రాజ్య స్థాపన కోసం, సొంత ఎజెండా కోసం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ గిరిజన నాయకులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

మహబూబాబాద్ రూరల్: గీతా ప్రెస్ ట్రస్ట్ అధినేత బైద్యనాథ్ అగర్వాల్ మృతిపై మానుకోట గీతా ప్రచారక పరిషత్ బాధ్యులు మౌనం పాటించి సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో ఆదివారం రాత్రి గీత ప్రచారక పరిషత్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద హిందూ మత గ్రంథాల ప్రచురణ సంస్థ గీతా ప్రెస్ ట్రస్ట్ అధినేత బైద్యనాథ్ అగర్వాల్ మృతి చెందడం విచారకరమని వారు పేర్కొన్నారు.

రెడ్యానాయక్‌ను గెలిపించాలి

మరిపెడ రూరల్: డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌ను వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి గెలిపించాలని ఎంపీపీ గుగులోతు అరుణరాంబాబు అన్నారు. మరిపెడ మండలం తండధర్మారంలో ఎంపీపీ ఇంటింటికి తిరుగుతూ ఆదివారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని గుండెపుడిలో సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుగులోతు వెంకన్న, సర్పంచ్ గుగులోతు లక్ష్మి పాల్గొన్నారు.

కురవి: సీరోలు మండలం చింతపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ డోర్నకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, రాంచంద్రారెడ్డి, బాలాజీనాయక్, కొంపెల్లి సతీష్, మామిళ్ల వెంకన్న, నరహరి పాల్గొన్నారు.



మరిపెడ రూరల్: తండధర్మారంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ అరుణ

దళితుల అభ్యున్నతికి కృషి

డోర్నకల్: తొమ్మిదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ దళితుల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక ఫైర్‌స్టేషన్ రోడ్డులో ఆదివారం పలు దళిత సంఘాలతో నిర్వహించిన సమావేశంలో చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా డీఎస్ రెడ్యానాయక్‌ను మరోసారి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, మహబూబాబాద్ మార్కెట్ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, కౌన్సిలర్లు బోరగళ్ల శరత్, కొండేటి హేమచంద్రశేఖర్, బసిక అశోక్, కోఆప్షన్ సభ్యులు రాంభద్రం పాల్గొన్నారు.



డోర్నకల్: నినాదాలు చేస్తున్న నాయకులు

యువతను మోసగించిన కేసీఆర్

డోర్నకల్: ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించకుండా సీఎం కేసీఆర్ యువతను మోసగించారని సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక సుభాష్‌వీధిలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చారని అన్నారు. ఎన్నికల హామీలైన డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పింఛన్లు, యువతకు ఉద్యోగాల కల్పన లాంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. ఎన్నికలకు ముందు గృహలక్ష్మి, దళిత, బీసీబంధు లాంటి పథకాలను ప్రకటించి ఎన్నికల కోడ్‌తో వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసగించిన కేసీఆర్‌కు అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నెల్లూరు నాగేశ్వర్‌రావు, పోగుల శ్రీనివాస్‌గౌడ్, ప్రభేష్, జెన్ను స్వామి, రాంజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

బీఆర్ఎస్‌కు పీఏసీఎస్ చైర్మన్ రాజీనామా



రాజీనామా ప్రకటిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి

గూడూరు: బీఆర్ఎస్ పార్టీకి తనతోపాటు బొల్లెపల్లి జీపీ పాలకవర్గం, బీఆర్ఎస్ గ్రామపార్టీ కార్యవర్గం మొత్తం రాజీనామా చేస్తున్నట్లు బొల్లెపల్లికి చెందిన సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ చైర్మన్ చల్లా లింగారెడ్డి ప్రకటించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంత కాలంగా ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ప్రవర్తన తీరు నచ్చలేదన్నారు. ఆయన వల్ల తాను ఎంతో బాధపడుతున్నట్లు తెలిపారు. మరో వారం రోజుల్లో ఏ పార్టీలో చేరేది చెబుతానన్నారు.

కాంగ్రెస్ వైపు మొగ్గు?

ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ప్రవర్తన నచ్చక పార్టీకి రాజీనామా చేసిన పీఏసీఎస్ చైర్మన్ మొదట్లో సీనియర్ నాయకుడిగా పేరు గాంచిన కాంగ్రెస్ పార్టీలో చేరుతామనే ప్రచారం జరుగుతుంది. పీఏసీఎస్ చైర్మన్, బొల్లెపల్లి గ్రామస్తులు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో పలువురు పార్టీ పరిస్థితిపై చర్చించుకుంటున్నారు.

సామాజిక న్యాయం కోసం పోరాడుదాం

నెహ్రూసెంటర్: సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల కల్పన కోసం పోరాడాలని బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో దళిత్ సమ్మిత్ జిల్లాస్థాయి సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం, ప్రైవేటు రంగంలో రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, జనాభా దామాషా ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. అంటరానితనం, కులవివక్ష రూపుమాపేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని డిమాండ్ చేశారు. బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సులో అల్వాల వీరయ్య, నర్ర శ్రావణ్, మండ రాజన్న, వంకాయలపాటి చిరంజీవి, కుర్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలమల్లేష్

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



గార్ల: ఈనెల 13వ తేదీన బైక్‌పై ఖమ్మం వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన ఓ యువకుడు ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని కోట్యానాయక్‌తండాకు చెందిన మూడు దేవేందర్(26) ఈనెల 3న బైక్‌పై మిరపతోటకు పురుగుమందులు తీసుకురావడానికి ఖమ్మం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొట్టడంతో దేవేందర్‌కు తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. నాటి నుండి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి తెల్లవారుజామున దేవేందర్ మృతిచెందాడు. ఖమ్మం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

బీఆర్ఎస్ పార్టీ హామీలు నమ్మొద్దు



బీజేపీలో చేరిన కార్యకర్తలతో హుస్సేన్‌నాయక్

గూడూరు: నియంతపాలన కొనసాగించిన సీఎం కేసీఆర్ మాటలు, హామీలు నమ్మరాదని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్‌నాయక్ అన్నారు. పల్లెపల్లెకు బీజేపీ.. ఇంటింటికీ హుస్సేన్ నాయక్ 3వ విడత ప్రజా ఆశీర్వాద యాత్ర ఆదివారం మండలంలోని పొనుగోడు, చిర్రకుంటతండ, మచ్చర్ల గ్రామాలలో సాగింది. ఈసందర్భంగా హుస్సేన్ నాయక్ ప్రజల సమస్యలను అడిగి తెల్సుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం అన్నారు. తనకు ఓటేసి గెలిపించాలన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన 100మంది బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాయిని ధార్మరెడ్డి, మండల అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, మేరెడ్డి సురేందర్, మేరుగు మల్లయ్యగౌడ్, సమ్మెట సుధాకర్‌గౌడ్, చీకటి కిరణ్‌గౌడ్, బానోతు శ్రీనివాస్‌నాయక్, రాసమల్ల వెంకన్న పాల్గొన్నారు.

బీజేపీలోకి చేరికలు

మహబూబాబాద్ రూరల్: మండలంలోని వేమునూరు, ఉత్తర తండా గ్రామాల నుంచి పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి జాటోతు హుస్సేన్ నాయక్ సమక్షంలో బీజేపీలో ఆదివారం చేరారు. కార్యక్రమంలో పార్టీ మానుకోట రూరల్ మండల అధ్యక్షుడు పసుపులేటి నవీన్ నాయుడు, మండల కోఆర్డినేటర్, మాజీ ఎంపీటీసీ దారావత్ శ్రీను, యూత్ సంఘం నాయకులు అశోక్, రాజ్ కుమార్, శశి వర్ధన్, రవీందర్, ప్రకాష్, నవీన్, ప్రవీణ్, సింహాద్రి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మరిపెడ రూరల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని చింతలగడ్డతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రేక్యతండాలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. కథనం ప్రకారం.. రేక్యతండాకు చెందిన రైతు బానోతు ఠాగూర్ చెందిన ఇంటి ఆవరణంలోని రేకుల షెడ్డులో కట్టేశాడు. ఈక్రమంలో ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ కాలిపోయి షెడ్డు రేకుల విద్యుత్ సరఫరా అవుతుంది. ఇదే క్రమంలో ఆవు విద్యుత్ షాక్‌కు గురై ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని రైతు బోరున విలపించాడు.

‘ఆరు గ్యారంటీలకు మంచి స్పందన’

పెద్దవంగర: ఆరు గ్యారంటీ పథకంతో కాంగ్రెస్‌కి మంచి స్పందన లభిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దంతాలపల్లి ఉపేందర్, బండారి వెంకన్న అన్నారు. ఆదివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో గడపగడపకు కాంగ్రెస్ పల్లె పల్లెకు ఝాన్సమ్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దంతాలపల్లి రవి, మాజీ సర్పంచ్ జాటోతు వెంకన్న, నాయకులు వల్లపు శ్రీనివాస్, బాషబోయిన యాకయ్య, ముత్తినేని సోమేశ్వర్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపించాలి

బయ్యారం: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్ అన్నారు. గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా ఆదివారం మండలంలోని కస్తూరినగర్, రాయికుంట గ్రామాల్లో పర్యటించారు. ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సోమేష్, జగత్‌రావుపేట సర్పంచ్ భాస్కర్, నాయకులు నాగేశ్వరరావు, మోహన్, మహేందర్, భావ్‌సింగ్ పాల్గొన్నారు.



పెద్దవంగర: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉద్యమకారులను విస్మరించడం తగదు

డోర్నకల్: రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించిన ఉద్యమకారులను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించడం తగదని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకుడు అన్నారు. డోర్నకల్‌లో ఆదివారం తెలంగాణ ఉద్యమకారుల అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహించారు. బైపాస్ రోడ్డులోని అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డోర్నకల్, గార్ల, కురవి, మరిపెడ మండలాల నాయకులు అజ్మీర పర్సానాయక్, రత్నాకర్‌రెడ్డి, భూక్యా నాగేశ్వర్‌రావు, సంద్రగిరి కృష్ణమూర్తి, మేకల రామారావు, మామిడి నాగరాజు, ఎస్‌కె గౌస్, రాజేందర్, ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

కారు, ఆటో ఢీ.. మహిళకు తీవ్రగాయాలు



కాలికి తీవ్ర గాయంతో సులోచన

గార్ల: కారు ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మందిలో ఓ మహిళకు తీవ్ర గాయలు కాగా, మరో ముగ్గురికి స్వల్పగాయలైన సంఘటన ఆదివారం అంజనాపురం క్రాస్‌రోడ్డు వద్ద చోటుచేసుకుంది. వివరాలిలావున్నాయి. గార్ల మండలం అంజనాపురం క్రాస్‌రోడ్డు వద్ద గార్ల నుంచి నర్సింహులగూడెం వైపు వెళ్తున్న ఆటోను సత్యనారాయణపురం నుంచి వస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నర్సింహులగూడెం గ్రామానికి చెందిన సులోచన తలకు కాలుకు తీవ్రగాయాలు కాగా, మరో ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సహాయంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సిబ్బంది నరేష్, ప్రశాంత్ తెలిపారు.

అమరుల త్యాగాలను స్మరించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: భారత విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరుల త్యాగాలను స్మరించుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అమరవీరుల సంస్మరణ సభల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కొత్తపల్లి రవి మాట్లాడుతూ.. నవంబర్ 1వ తేదీ నుంచి 9వ వరకు అమరవీరుల సంస్మరణ సభలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి బిల్లకంటి సూర్యం, పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగయ్య, అనిల్, గంగరాజు పాల్గొన్నారు.

సీఎం సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

గార్ల: ఇల్లందులో నవంబర్ 1వ తేదీన నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి సీఎం బహిరంగ సభకు 10వేల మందికి పైగా తరలించేలా పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ ఎం శివాజీచౌహాన్, ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌చంద్, సర్పంచ్‌లు ధరావత్ సక్రు, శంకర్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, రమేష్, గణేష్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తాం

తొర్రూరు: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న తరుణంలో అక్రమ మద్యం ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తామని సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అన్నారం రోడ్డులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న రూ.7వేల విలువ చేసే మద్యంను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ.. అక్రమంగా తరలించే, నిల్వ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నామని, బెల్టు దుకాణాలను కట్టడి చేస్తున్నామన్నారు. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే సరైన పత్రాలు చూపాలన్నారు. తనిఖీల్లో ఎస్సైలు జగదీష్, అరుణ, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

గార్ల: మండలంలోని లింగ్యాతండాకు చెందిన బోడ లక్ష్మణ్ బెల్ట్‌షాపుపై పోలీసులు దాడి చేసి మద్యం బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న ఆదివారం వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మండలంలో ఎవరైనా బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. దాడుల్లో కానిస్టేబుల్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: పట్టుబడిన మద్యం, నిందితుడిని చూపుతున్న పోలీసులు

మహాసభకు తరలిరావాలి

నర్సంపేట: హైదరాబాద్‌లో నవంబర్ 18న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు, నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్ మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఇందిరమ్మనగర్ కాలనీలో మాదిగ యువసేన ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. మహాసభకు నియోజకవర్గంలోని మాదిగలు, ఉపకులాలు, ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో మునిగె యాకుబ్, కొలకనూరు నిరంజన్, బోయిని నారాయణ, జాంబవ్, గుండేటి వీరేష్, చిలుక కుమార్, జన్ను గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలు పార్టీల నాయకుల చేరిక



కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు

గూడూరు: గూడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కలకత్తతండా, కేశ్యతండాకు చెందిన పలు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన వాంకుడోతు సోమన్న, ధారావత్ గోల్య, శ్రీనివాస శంకర్, దుద్య, సురేష్‌లతోపాటు పలు కుటుంబాల సభ్యులు రాజీనామా చేసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివరాత్రి సంపత్, చంటి స్వామి, మండల మల్లేష్, కన్నబోయిన వెంకన్న, సమ్మెట శ్రీనివాస్‌గౌడ్, ఎలమందల శ్రీనివాస్, రసూల్, రాసమల్ల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చిన్నగూడూరు: మండల కేంద్రంలోని మృతుల కుటుంబాలను డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదివారం పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన పత్తిపాక సత్యనారాయణ, శ్రీరాం సోమయ్య ఆదివారం ఉదయం వివిధ కారణాలతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతదేహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గిరిపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బాధవత్ రెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం విషయం తెలుసుకున్న డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పరామర్శించాడు.